కథానిక

# విశ్వం చూసిన వెలుగు

"గోపి"

నేను వ్రాస్తున్న యీ కథనమే రోజున్నర వెనక వ్రాసియుంటే అంతా స్వీయచరిత్ర ప్రధానంగానూ నూతన సమాజ నిర్మాణానికి పునాదిగాను, ఉన్నతమంత్రిగారి ప్రధానకార్యదర్శిగా, ఎంతేనా సంతోషంగా వ్రాసియుండేవాణ్ణే...కాని ఎప్పుడో ఒకప్పుడు మనిషి ఆత్మవిమర్శలో పడకమానడు, జరిగిపోయిన విషయాలు దూరదర్శని లోంచి చూచినట్లు కనబడకమానవు. ఆశావాదం నిరాశావాదంగాను, కలిమి నైతికపతనంగాను ధైర్యం, వాస్తవికతనుండి పలాయనంగాను తోస్తాయి. కొద్ది క్షణాలు నిర్లిప్తంగా ఊరుకున్నాడా, ఆత్మవికాసాన్ని శాశ్వతంగా పోగొట్టుకుంటాడు. కాని వికాసాన్ని చూచిన వెంటనే, విమర్శలోపడి, జీవిత పరమావధినిగూర్చి ఆలోచించి, అనుకున్నది ఆచరిస్తే జీవితానికి శాంతి చేకూరుతుంది ... బాధపడ్డా...

'టంగ్' 'టంగ్' మని ఐదుగంటలు నిశ్శబ్దంలో విన్నాను. గడియారంకూడా నాలాగే నిముసాలని నిర్దాక్షిణ్యంగా నడిపించుకు పోతూంది. నాలుగు గంటలకే పనైపోయింది. మర్నాటికి కావల్సిన 'ప్రత్యేకపు బందోబస్తు' అభేద్యంగా చేసిపెట్టాను, పాతఏడు పెర్మిట్లు సంతకాలైనట్లుగానే,ఏనిమిదవది కూడా ఐపోతూంది. ఈ విషయం ఒక్కమనిషికి కూడా తెలియదు. కంపెనీవారు మిగతా 16 లక్షలు ఇచ్చేస్తారు. పంపకాలు కూడాఐపోతాయి. రెండో కంటివాడికి తెలీకుండా, తన భాగం 10 లక్షలూ వచ్చేస్తాయి! 10 లక్షలు!! అని ఆలోచిస్తూ, 'అమీన్' అన్న నా అధికార పూర్వపు గొంతుకవిని సమస్య పూర్తి చేసినట్లుగా 'హేటందుకో' అన్నమాట పూర్తిచేసి, కాగితాలని సర్దటంలో వచ్చేశబ్దం, నా చెవినిపడింది. ఆఫీసులో తన దిగువవారిని స్వల్పవిషయాల్లో కూడా ఏడిపించడం, చిన్న విషయాల్లో కూడా కలుగజేసుకుని గొడవచేయడం ఆఫీస్ డిసిప్లిన్ క్రింద చలామణీ ఔతుంది. 'మంచినీళ్లు' అన్నా, మళ్ళా కాగితాలు విప్పుతూ. దీర్ఘనిశ్వాసాలు విడిచేవారి ఆవేదన నాకో ఆనందం. బహుశా చాలామంది ఆఫీసు టైముకి రెండు మూడు గంటలు ముందే వస్తారు. కాని 'అయ్యగారు' ఆఫీసు వదలందే పిట్టమనిషి కూడా వదలకూడదు. చాలామందికి నే కనబడను. గొంతుకలోంచీ మాట్లాడుతూ 'అయ్యగారు ఏంచేస్తున్నారు?' అన్నప్రశ్న చెవిని పడితే ఏంత స్వోత్కృష్టత! మంచినీళ్ళు త్రాగి 'హేటందుకో' అన్నా. బడిపిల్లలు పలకా పుస్తకాలు కట్టేసినట్టు దస్తరాలన్నీకట్టేసి, హేటు చేత్తో పుచ్చుకున్న నా వెనకాల వారివారి తాహతుకు తగినట్లుగా అనుసరించాలి, ఆఫీసు సూపరెంటు మొదలు చప్రాసీవరకూ.

అకాలంగా వచ్చిన బట్టతల అందవికారాన్ని కప్పిపుచ్చడానికి నెత్తిని హేటు బోళించుకొని స్ప్రింగుతలుపుని ముందుకు నెట్టాను. పరిస్థితులు సానుకూలంగానే ఉన్నట్లు కనిపించి ఒక్కసారి విషమించినట్లు, సుళువుగా ముందుకు నెట్టబడినది, ఫెడీమని వెనక్కి తన్నింది. దాంతో హేటు క్రిందపడింది అవమానంతో ముఖం ఎర్రబారింది. అకస్మాత్తుగా వెనక్కి తిరిగిచూచా. ఆఫీసు దస్తరాల్లాగే స్తబ్దల్లా ఉండే క్లార్కుల నేత్రాల్లో ప్రక్షిప్తంగా చిన్న నవ్వు కనబడింది. ఒళ్లు మండిపోయింది. అసలు ప్రతీవిషయంలోనూ తప్పు అనేది తక్కువ అంతస్తులో ఉన్నవాళ్లే చేస్తారని నమ్మే నా అధికారపు హోదాలో నా హేటు పడిపోడానికికూడా కారణం వాళ్లే అనిపించి 'కొరకొర' వెనక్కి చూచాను. ఆఫీసు బల్ల తలుపులు పటాలు అన్నీ తుడిచే చిన్న గావంచాతోనే నాహేటు కూడా తుడిచి నాచేతి కందించాడు అమీన్...

అవమానంతోపాటు, కోపంకూడా వచ్చింది. కారు దగ్గరకువచ్చి ఎదురుగా నిలబడ్డ రిక్షా రామన్నకా హేటిచ్చేశా, అదేదో పెద్ద తప్పు

చేసినట్లు. మంత్రిగారి ప్రధాన కార్యదర్శిగారి నున్నటి బట్టతల బదులు, రిక్షావాని జింపిరి తల దూరిందా హేటుక్రింద. తెలీని అవమానంతో తల వంచుకున్నా. స్ప్రింగ్ డోర్ తిరుగుబాటు, గుమస్తాల ప్రచ్ఛన్నపు నవ్వు, స్థానభ్రష్టత చెందిన నాహేటు అన్నీ నాలో అనుకోని చలనాన్ని కలిగించాయి.

ఇంటిదగ్గర దిగేసరికి వెనకనుంచీ అమీన్ కూడా సిద్ధం. కారు వెనకాలే కూర్చొని వచ్చాడని ముఖం జుట్టునిండా ఉన్న ధూళీ తెలియ పరుస్తూంది.

'ఏమొచ్చావ్?' అని గద్దించాను.

'చిత్తం తమ శలవైతే' అని నముల్తున్నాడు.

'కారు షెడ్‌లోపెట్టు' అని డ్రైవరుకి చెబితే-

'చిత్తం అమ్మగారేమో' అని సింగు నసిగేడు. చిరాకుగా గది చేరుకున్నా.

అద్దంలోంచీ చూచిన దేమంటే వణుకుతూన్న పెదిమలు, ఎఱ్ఱబారిన నేత్రాలుతో చిరుచెమట తుడుచుకుంటూ వస్తూన్న అమీన్, నన్ను నమ్మిన బంటు అమీన్...కాని ఆకారంచూస్తే నన్నేదో కత్తితో పొడవడానికి వస్తూన్నట్లనిపించింది. వెంటనే డ్రాయరు తెరచి పిస్తోలు కనబడకుండా పట్టుకొన్నా...అమీను ఒక వెకిలినవ్వు నవ్వి...'తమ బంటును కాల్చెయ్యండి కావలిస్తే కాని...రేపటి ఏర్పాట్లుమాత్రం రద్దు చెయ్యండి' అన్నాడు. నా ఒళ్ళు భయంతో ఆశ్చర్యంతో కంపించింది.

"నువ్వన్నదేమో నాకర్థంకావటంలేదు" అని గట్టిగా అరిచాను.

"చిత్తం, తమ దయ, మీ దాసుణ్ణి; నన్ను నమ్మండి ప్రభువులు..." అంటూ అర్థరహితంగా గొణుగుకుంటూ వెళ్ళిపోయాడు.

నన్ను నమ్మిన సేవకుణ్ణి ఉపకారానికి తలపెట్టి తెగించి ఎదుటపడి చెప్పినవాణ్ణి, అనుమానించి కాల్చేద్దామనుకున్న నా నైతిక పతనం, ఇప్పుడు కాని తెలియలేదు.

"నాన్నా! నాన్నా!" అని రాగయుక్తంగా పాడుకుంటూ గంతులేస్తూ టై విప్పుకుంటూన్న రెండుచేతులూ లాగేరు సుధా, ప్రభాకరులు. టై ఉరిత్రాటిలా బిగుతై ఊపిరిసలపక దగ్గితే నవ్వి సకిలించారు. కోపంగా ఉన్న నా ముఖంచూసి నా బూట్సు మేజోళ్ళువిప్పేసి ఒక్కపరుగులో జోళ్ళరేకునుంచి సుధ ఎర్రవి, ప్రభాకర్ నల్లవి స్లిప్పర్స్ తెచ్చి నాముందుంచి, సరికాదని ఈ జతపడేసి ఉండిపోయిన జత తెచ్చేశారు! నేను ఆ అమాయకుల అవస్థచూచి నవ్వకుండా ఉండలేకపోయాను. ఇద్దరికీ చెరో బేడకాసు ఇచ్చి నా స్లిప్పర్సు నేను తెచ్చుకున్నా.

రాణీసాహేబాగారు తగినంత టైంతీసుకుని షోగ్గా సింగారించుకుని గుబాళింపులు వెదజల్లుతూ వచ్చి, "ఏం వెడుతున్నామా?" అని అడిగింది క్లుప్తంగా.

"ఎక్కడికి?" అన్నాను తెలియనట్లుగా.

"ఓహో! అప్పుడేమరిచిపోయారుకామోసు!"

"లేదు దేవీ! మరిచిపోలేదు. ఇవాళ చాలా చికాకుగాఉంది తోటలోకూర్చుందాం" అన్నాను.

క్షణంలో మారిపోయాయి ఆమె కళలు.

"పోనీలే కాలువకి వెళ్ళి కూర్చుందాం-సరా! బజార్లు ఎక్కడికీ పారిపోవు రేపు వెళదాం" అని సముదాయించాను.

దుస్తులు మార్చుకుని, 'కాలువగట్టుకి పోనీ' అని డ్రైవరుకి ఆజ్ఞాపించి కారులో కూర్చున్నాం. కొంచెంసేపు నమ్మలేనట్టు చూచి, నా ఆజ్ఞలో మార్పురానందువల్ల కాలువగట్టుకే పోనిచ్చాడు... పరధ్యానంగా ఎక్కుతూండటాన్న, తల టాపుకి తగలడం తలవెంట్రుక వాసిలో తప్పిపోయింది. వెనకవచ్చే వాహనాలను చూచేందుకున్న అద్దంలోంచి డ్రైవర్ ముఖం చూడబోయిన తమాషా తప్పి నిస్పృహచెందినవాడిదిలా కనబర్చింది.

కాలువ చేరాం. అంతస్తుల్లా కాలవ దొంతర్లలోంచీ జోరుగా పారుతూన్న నీటిని చూచి ఆనందం పట్టలేకపోయారు సుధ, ప్రభాకర్లు. శ్రీమతి కూడా కార్లో చెప్పులు వదిలేసి కచ్చ పైకెగట్టి గట్టుమీదనుంచి నీట్లోకి విడిచింది కాళ్ళు. బూట్లు విప్పటం ఇష్టంలేక నే గట్టుమీదనే చేతిగుడ్డ పరుచుకొని కూర్చున్నా.

"ఇనుపపెట్టెలో పదిలపర్చినలాంటి నా ప్లాన్లు అమీనుకెలా తెలిశాయి. లేక అమీన్ మరో విషయం ఏమన్నా చెప్పాడా?" ఇదే విషయాన్ని పదేపదే ఆలోచిస్తున్నాను.

నే చేసిన బందోబస్తులు మనస్సులో ఎన్నిసార్లు తిరగవేసినా, లోసుగెక్కడా కనబడలేదు... ఆలోచనలోంచి దృష్టితప్పి దూరాన్న కొండల మీద పడింది. కొండలు, మేఘాలు, జలజలా ప్రవహించి పోతూన్న కాలవనీరు, నాకేదో నీతి కరపటానికి నన్నుచూచి పరిహసించడానికిమాత్రమే అంత అందంగా ఉన్నట్లనిపించింది. సమయం గడుస్తూన్నకొద్దీ చిన్న చిన్న శబ్దాలు స్పష్టంగా వినబడటం మొదలు పెట్టాయి. కాలువ చెబుతోంది. "జీవిత పరమావధి ప్రజోపయోగం కోసం కాని స్వార్థం కోసం కాదు. ఎన్నేళ్ళు వస్తేనేం, ఎంత డబ్బుంటేనేం" ఇహ వినకుండా దూరాన్న కొండలు మీదికి మళ్ళించా నా దృష్టి. అస్తమించే సూర్యుని ఆఖరి కిరణాల వెలుగులో మెరుస్తూ, చల్లగా వస్తున్న మేఘాలని మందలిస్తున్నాయి కొండలు.

"ఏం తాపీగా నడుస్తున్నారు? వేళకాలేదా? నదీమతల్లి నన్ను తిడుతోంది; పంటలకి నీళ్ళక్కర లేదనుకున్నారా? ఎన్ని వేలమంది మీకోసం కళ్ళు ఆకాశానికి తిప్పుకు చూస్తూంటారో చూడండి" అని. దేశసౌభాగ్యంకోసం ఆత్మబలిదానం చేసే వీరులలా నవ్వి హాస్యమాడాయి మేఘాలు. బలే! బలే! మా విధిని నువ్వు చెప్పాలేం? ప్రజల పేర పిలిచి చల్లగా మేం కాస్తా బెల్లంముక్కలా కరిగిపోతే పచ్చని క్రొత్త తొడుగుల అందాలతో పుష్పఫల భరితంగా సింగారించుకొని కులుకుదామని కదూ నీ ఉలుకు" అని దెప్పిపొడుస్తున్నాయి.

"సరి! సరి!! మీ సల్లాపాలకేం నేనింకో ప్రపంచానికి వెలుగు చూపాలి." అంటూ చెట్లచాటు నుంచి కొంటె చూపు చూచి మాయమయాడు సూర్యభగవానుడు...ఎటుచూచినా స్వార్థత్యాగం వెల్లివిరుస్తోంది ప్రకృతిలో. చేతనా చేతన పదార్థాలు రెండూ ఒక్కలాగే సహాయపడుతున్నాయి 'మరోళ్ళకి'...ఆలోచనా ప్రపంచంలోంచి లాగేశారు సుధా ప్రభాకర్లు... సుధ గౌను తడిసిపోయింది. ప్రభాకర్ లాగూ చొక్కా బురదమయం. సుధ ఫిర్యాదు.

"చూడు నాన్నా! నువ్విచ్చిన బేడకాసు లాక్కున్నాడు ప్రభ!"

"నువ్వు పారేస్తావ్!" అని వాడి బెదిరింపు.

"నువ్వివ్వు నే నమ్మదగ్గర దాచుకుంటాను"

"నీదికాదు ఫో" అని ప్రభ వ్యధికరణ.

"దానిడబ్బు నీకెందుకురా?" అన్నా బహు కష్టంమీద బొంగురు పోయిన గొంతుకతో. కాని మనసులో "ఆ బేడకాసెవరిది? నాకెక్కడనుంచి వచ్చింది?" అన్న ప్రశ్న వచ్చింది.

ఇష్టంలేకుండానే అందించాడు బేడకాసు సుధకు.

బేడకాసుకూడా నన్నుచూచి నవ్వింది.

"నీలో ఈ మాత్రం న్యాయముందా? బాలుడు చేసిన తప్పుకు దిద్దుకున్నాడు. నువ్వో? ఎన్ని వేల బేడకాసులు ఎందరికివ్వాలో!"

ఆలోచనల్ని బలవంతంగా దులిపేసి 'సింగ్' అని పిలిచా. చక్రానికి తలానించుకుని నిద్రపోతూన్నవాడు నాగొంతుకవిని ఉలిక్కిపడి లేచాడు.

"ఏమిశలవు" అని పరుగెత్తుకువచ్చి అడిగాడు.

"ఫ్లాస్కులో కాఫీవుందా?" బిక్క మొహం వేశాడు. అదీ వాడి తప్పులాగే.

"పోయి తీసుకురా!" కారు తీసుకుపోయాడు పాపం మా వినోదంతప్పు మరోటి వాడికిలేనట్టుగ!

"చూశారా! వెధవన్యాయం! ముందు డబ్బు తీసుకుపోయాడు రేపుతెస్తానని ఇపూ పత్తాలేదు. దొంగవెధవ! ఎవరిబాబుగారి సొమ్మనుకున్నాడో? వాడి మనసులో? రేపుకాని రాకపోతే పోలీసు కంప్లైంటు చేస్తా చప్పగా కుదురుతుంది వాడిరోగం" అని శ్రీమతి చెప్పుకుపోతూంది. దేన్నిగురించో!

"న్యాయంట! న్యాయం!!" 'చదువుకొని ఆచర్యాలు తెలిసిన మనలోనే లేనిన్యాయం వాళ్ళలో ఎలా వస్తుందో!' అనుకున్నా మనసులో.

ఎందుకో శ్రీమతిని తేరిపార చూచాను. ఇంకా కాళ్ళు నీళ్ళల్లోనే ఉన్నాయి. ఆమెకి ప్రకృతిమీద కాని పిల్లలమీదకాని, నామీదకాని దృష్టిఉన్నట్లు కనబడదు. ఏవో నగలు, వస్తువులు గురించే ఇంకా ఆలోచిస్తున్నది. బహుశా ఎంతమార్పు, పది సంవత్సరాల క్రిందట సనాతనంగా ఉండే శ్రీమతి నా ప్రోద్బలంచేత క్లబ్బులు షికార్లు ఫ్యాషన్లు నేర్చుకుంది. మీటింగులకి టీపార్టీలకీ తప్పదంటేనే వచ్చేది. వంటపనిచేసుకుని ఆఫీసునుంచి వచ్చేసరికి నాకోసం ఎదురుచూసేది. చేతిలో పువ్వులపొట్లాం ఆప్యాయంగా అందుకొనేది...ఇప్పుడు అన్నింటికీ

బంట్రోతులే. నాకు కాఫీ ఇవ్వడం, పిల్లల్ని పెంచడం... ఒకటేవిటి. ఇప్పుడామెకి ఆవగింజంత తక్కువకాకూడదు. ఆమె ఆజ్ఞలు అందరూ పరిపాలించాల్సిందే'....ఈ డబ్బొచ్చి ఏం సుఖపడ్డాం?

డ్రైవర్ కాఫీ తెచ్చాడు. మూతి కాల్చుకుంటూన్న వేడిలో ఒలకపోసుకుంటూ త్రాగేసి, మళ్ళా ఆటకి పోయారు సుధ, ప్రభాకర్. ఆలోచిస్తూ త్రాగుతున్నా. శ్రీమతి తిడుతోంది..“వెధవ కాఫీ' ఎవడిచ్చాడో? పాల్లేవు, పంచదారా లేదు.”

గట్టుదాటి వింటిలా వంగి, పదడుగుల ఎత్తు సునాయాసంగా గెంతుకుపోతూంది నీరు. ఆలోచనల వేడికి తట్టుకోలేక బూట్లూడదీసుకొని కాళ్లని నీట్లో జారవిడిచాను. నాచుపాయ 'పదడుగులూ క్రిందకి దూకుతే చితికిపోతానేమో'అన్నట్లు నా కాళ్ళకి చుట్టుకుంది. ఛర్రున విదల్చేశాను. పాపం ప్రవాహంలో పడిపోయింది. “ఛీ! నీ కాళ్లు పట్టుకుంటే విదల్చేశావ్! నీకేం లంచం చెల్లించలేదనా' అని గొణిగినట్లయింది. మరో నాచుపాయ నన్నిట్లే అర్థంచేసుకున్నట్లు దూరంనుంచే వెళ్ళిపోయింది నా కాళ్ళు పట్టుకున్నకనటే, ఆ ఎత్తునుదూకడమే నయమన్నట్లుగా.

క్రిందకి తీక్షణంగా చూచాను. ప్రవాహం నా కాలుమీదికి ఛర్రున నురగలు కక్కుతూ వస్తున్నది. పాపం పంటపొలాలకి పోయేందుకు ఆలశ్యం ఔతూందని కామోసు...సుధా ప్రభాకరులు వచ్చి ఎప్పుడు కూర్చున్నారో నాప్రక్క. సుధ ప్రవాహంవడికి, కాళ్ళమీదకి నురగలు కక్కుతూ లేస్తూన్న నీటిపాయను చూపిస్తూ 'చూడు నాన్నా! కుక్కపిల్లలా ఎలా మీద పడుతూందో పోవద్దనీ!'...ఏదో తెలీని దెబ్బతిన్నట్లయింది సుధమాటలు వింటూంటే!...

కారులో కూర్చున్నాక పదేపదే జ్ఞాపకం రావడం మొదలుపెట్టాయి: హాస్టలులో ఉంటూ రాత్రి పన్రెండు గంటలవరకూ ఆదర్శాలు 'ఇజా'లు విమర్శిస్తూంటే వార్డెనుగాఉన్న ఆచారి మాష్టారన్న మాటలు.

“ఏం విశ్వం నువ్వేనా, ఆవాదన హడావుడి అంతాచూచి మ్యాటినీ లేవదీశావనుకున్నా, ఆదర్శాల అంతు వివాదాల్లోకాదు, ఆచరణలో. నువ్వు చాలా పెద్దవాడవౌతావ్! కాని మరిచిపోకు. ఈ ఆదర్శాలు ఆచరణలో పెట్టు. మానవ సౌభ్రాతృత్వం, దయన్యాయతత్పరత, ఇవన్నీ వాదాల్లో కమ్మగానే ఉంటాయి...అన్నారు. మరోమారు, చచ్చిన చేప తేల్తుందా మునుగుతుందా అనేనా? రేపు చూద్దాంలే ఇవ్వాళకి పడుకో.. ఇలాగే అనేసిపోయీవాడు ఎంత గోల చేసినా కూడా!

ఔను ప్రభుత్వంలో ఆఫీసర్నయి కాంగ్రెస్ని ఎదిరించాను. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వంలోనే ఉండి ప్రజలని దోపిడి ప్రారంభించాను. ఇంతకన్నా ఏం చెయ్యాలి వ్యతిరేకంగా. సంజె చీకటిని దూసుకుపోతూన్న ఆ కార్లోకి “ఇప్పుడేమంటావోయ్ విశ్వం?” అన్న మాటలు స్పష్టంగా వినబడ్డాయి.

“మానసిక వికాసాన్ని వెదజల్లి, అవినీతి దుర్గంధాన్ని కమ్ముకొస్తున్నావోయ్!” అని హాస్టల్లో ఉన్నప్పుడన్న మాటలే నన్ను వెంట పెట్టడం ప్రారంభించాయి. ఇంటిదగ్గర కారు దిగుతూనే చీకటి చాటున అమీనా చీటీ ఇచ్చి మాయమయ్యాడు. “బాబూ! మీకో వురి రేపటికి సిద్ధంగా ఉంది. దాంట్లోకి దిగబడకండి. ఇప్పటివరకూ ఐందేదో ఐంది. ఎంతకంతే చాలు బాబూ! నాకు చూడండి బాబూ పదకొండుమందిసంతానం. బ్రతకటం లేదూ?” ఇంక చదవకుండానే చీటీ పారేశాను. ఇంత హీనంగా ప్రజల సొమ్ము తింటూన్న నామీద అమీన్ కెందుకో ఇంతదయ!

నిద్రపోదామన్నా కన్ను మూతపడలేదు. శ్రీమతి నోరు తెరచుకుని నిద్రపోతూంది. పౌడర్ స్నోలతో మిసమిసలాడే పైపూత ఊడిపోయింది. విగ్రహం బాగా కనబడేందుకు కట్టుకున్న 'బ్రేసియర్సు' గతితప్పి వికృతంగా కనబడుతున్నాయి. డబ్బు హోదాలతో కల్పించుకున్న కృత్రిమ తృప్తి, స్వార్థంలో బలిసిన గర్వం, ఆమెలో సహజంగా ఉండే ఔన్నత్యాన్ని కళని ఏనాడో ధ్వంసం చేశాయి...అదే సమయంలో సుధ మళ్ళా బేడకాసుగురించి పలవరిస్తున్నాది. 'ఏముందిహ జీవితంలో! ధనం ఇవ్వగల్గినవీ చూచాను. అపహరించినవీ చూచాను. మానవుని

ఖర్చుదారీతనాన్ని తృప్తిపర్చేంత డబ్బుంటూ లేక పోవడం, ఎలావచ్చినా సరే డబ్బే ప్రధానం అనే ప్రలోభానికి మానవుడు గురికావటం, శీలాన్ని అమ్ముకొని డబ్బార్జించడం, నాలోని చుట్టూ ఆవరించుకున్న ఈ దుర్వ్యామోహం, మానవ సంఘానికే చీడపురుగని సుళువుగా తేలిపోయింది. ఆఖరికి నా బిడ్డలుకూడా ఎప్పుడో ఒకప్పుడు 'అందరి తలలూ కొట్టి తెచ్చిన డబ్బు'అని నిందించకమానరు. ఆఫీసులో ప్రజ నా అధికారానికి జడిసి గౌరవిస్తున్నారు. వారి హృదయాల్లో, బందీపై నేరస్థుడిపైన ఉన్న పాటి గౌరవంకూడాలేదు...అన్న ఆలోచనలు సాగిపోయాయి.

దూరాన రెండుగంటలు కొట్టారు. ధైర్యంగా 'దోషిని' అనిచెప్పి శిక్ష తీసుకోడం ఎంతమనసుని దిద్దపర్చుకున్నా జరగని పని. రాత్రి కలతనిద్రలో నేనేదో తెలీని రోగంతో బాధపడుతోన్నట్టు ప్రజలంతా 'పాపపు పొమ్ము తింటే ఏమాతుందని' సాధిస్తూన్నట్టు విని హడలి పోయాను. తెల్లారింది. లేస్తూనే ఒక నిశ్చయానికి వచ్చాను. నా చేతులతో నేను 'దోషిని' అని వ్రాసి ప్రభుత్వానికి పట్టుపడడం చేతకాని పని. కాని ఇనుప పెట్టెలో పదిలపర్చిన లాంటి నా ప్లాన్లని భేదించామని సంతోషపడే పోలీసులకి సంతోషాన్ని చేకూర్చగలను...కన్ను తెర్చుకొని మరీ పద్మవ్యూహంలో పడ్డానని మీకు తెలియపర్చడానికే ఇది వ్రాసింది కూడా. బహుశా ఇది మీవరకూవచ్చేసరికి వార్తా పత్రికలు నాకేమైందో కూడా తెలియపర్చే ఉంటాయి. ఇప్పుడు నా హృదయం తేలికపడింది. నేను ఇనప వూచల వెనకాల్నించి దేశాన్ని చూస్తే కొంత తేజస్సేదన్నా కనపడుతుందేమో!

కథానిక

# బంజర్ల పంపిణీ పథకం

పట్టెల విజయలక్ష్మి

బతుకులు భారంగా బాధగా నడుస్తున్నాయి. పేదకు గడ్డుదినాలు. రోజు గడవటం ఎంతో కష్టంగావుంది. కష్టపడకుండా కోట్లు సంపాదించే జమీందార్ల జేబులు నిత్యం నిండుతూనేవున్నాయి. బ్లాకుమార్కెట్టులో బ్లాకులకు బ్లాకులే నింపేస్తూన్నారు ధాన్యం. బజారులో గింజ కనపడదు. పేదకు పొట్ట గడిచేవిధం కనపడదు.

రోజులు మారాయి. కరువు కష్టంకొంతతగ్గించి మన ఆహారధాన్యాల కొరత తీర్చింది. కొనటానికి కానిడబ్బు కరువయింది. ఎటుచూచినా పేద మీదే దండయాత్ర. ఎటుచూచినా పేదకెలాంటి లాభం కనుపించటంలేదు. ఆంధ్రరాష్ట్రం వచ్చిందన్నారు పెద్దలు. వేడుక చేసుకున్నారు పేదలు. పండుగ చేసుకునేందుకు ప్రభుత్వం దగ్గరచేసిన బాకీలు తీర్చలేక కొరత బడ్జటుతో కృంగిపోతున్నారు గుమాస్తాలు. బి. ఏలు ఎం. ఏలు చదవటానికి ఉన్నదికాస్తా తగలెట్టి ఉద్యోగంలేక ఊర్లో చేసేందుకేమీ పనిలేక, ఇంట్లో రోజు గడిచేదిలేక పేపర్లోపడ్డ ప్రతి ప్రకటన అతి జాగ్రత్తగా చూస్తున్నారు యువకులు. కండక్టరు ఉద్యోగానికి కలక్టరు కావాలనుకున్న వారి దరఖాస్తులు. గుమాస్తా వుద్యోగానికి గుంటూరు చుట్టూ ప్రదక్షిణాలు. ఎటుచూచినా నిరుద్యోగం.

ప్రక్కింటివాళ్ళు చూడబోతే అవస్థంతా వాళ్ళదే అయినట్లు 'అమ్మా! అబ్బాయి ఏమిచేస్తున్నాడని' అడగటం...చదివి ఇంట్లో కూర్చున్న కొడుకును పోషించేందుకు కూడా శక్తిలేక విసిగిన తల్లిదండ్రులు 'ఏముందమ్మా వుద్యోగం వచ్చింది లేకపోయినా ఊర్లన్నీ ఆ యింటర్వ్యూ అని, అదని, యిదని తిరగటానికి చాలటంలేదు ఎక్కడి డబ్బుకూడా' అని విసుక్కోవటం. 'అయ్యో! ఏదైనా ఉద్యోగం చేస్తున్నాడేమోనని మొన్న మా మేనత్తవచ్చినపుడు, తన పిల్లనిస్తాను కనుక్కోమనందమ్మా!" అంటూ ప్రక్కింటావిడ మూతి విరవటం-వింటున్న, చూస్తున్న చదువుకున్న యువకులు "ఎందుకురా యీ జీవితాలు, ఎందుకూ